జగనన్నను సీఎం చేసుకునేందుకు ప్రజలు సిద్ధం

- వైఎస్సార్‌సీపీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్‌రెడ్డి


వైఎస్సార్‌సీపీలో చేరిన వారిని ఆహ్వానిస్తున్న ఎమ్మెల్సీ పర్వతరెడ్డి


బర్మాషెల్‌గుంట వాసులతో మాట్లాడుతున్న చంద్రశేఖర్‌రెడ్డి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకునేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. రాంజీనగర్‌లోని పార్టీ కార్యాలయంలో 15వ డివిజన్ యూత్ లోకేష్, అజయ్, గుణవంత్ ఆధ్వర్యంలో 100 మంది మంగళవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌రెడ్డి వారికి పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీలో యువతకు సముచిత ప్రాధాన్యత కల్పిస్తామన్నారు. టీడీపీ ప్రజా వ్యతిరేకత వల్ల పెద్ద ఎత్తున ప్రజలు వైఎస్సార్‌సీపీకి చేరువ అవుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో సాయి, భాను, సాగర్, సుకేష్, సుధీర్, విశ్వ తదితరులు ఉన్నారు.

కలెక్టర్‌కు సమస్యను వివరిస్తా

బర్మాషెల్‌గుంట ఇళ్ల తొలగింపు సమస్యను మరోసారి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి బాధితులకు న్యాయం జరిగేలా చూస్తానని వైఎస్సార్‌సీపీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి బాధితులకు హామీ ఇచ్చారు. రాంజీనగర్‌లోని పార్టీ కార్యాలయంలో 52వ డివిజన్ ఇన్‌చార్జి మహబూబ్‌బాషా ఆధ్వర్యంలో మంగళవారం బర్మాషెల్‌గుంట రైల్వే స్థలాల్లో నివసిస్తున్న ప్రజలు ఎమ్మెల్సీని మంగళవారం కలిశారు. రైల్వే స్థలాల్లో ఉంటున్న తమ నివాసాలను ఈనెల 19వ తేదీలోపు ఖాళీ చేయాలని రైల్వే వారు హెచ్చరికలు జారీ చేశారని ఎమ్మెల్సీకి వివరించారు. స్పందించిన చంద్రశేఖర్‌రెడ్డి ప్రభుత్వంతో మాట్లాడి లబ్ధిదారులకు టిడ్కో గృహాలు కేటాయించేలా చర్యలు చేపడుతామన్నారు.

జేసీని కలిసిన కందుకూరు సబ్‌కలెక్టర్

నెల్లూరురూరల్: కందుకూరు సబ్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన హిమవంశీ జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్‌ను కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పూలమొక్కను అందజేశారు.

ఎమ్మెల్సీ పరామర్శ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): 43వ డివిజన్ జెండావీధిలో వైఎస్సార్‌సీపీ నేత నిజాముద్దీన్ తండ్రి జలాలుద్దీన్ మృతిచెందడంతో ఆయన భౌతికకాయానికి పార్టీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి మంగళవారం నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఆర్టీసీ ఉద్యోగుల ధర్నా

నెల్లూరు సిటీ: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏపీఎస్‌ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. నగరంలోని ప్రధాన ఆర్టీసీ బస్టాండ్ ఎదుట ఉద్యోగులు మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా కార్యదర్శి మురళీమోహన్‌రెడ్డి మాట్లాడుతూ తక్షణమే పీఆర్సీ కమిషన్‌ను ఏర్పాటు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలు తక్షణమే చెల్లించాలన్నారు. గత నాలుగేళ్లుగా నిలిచిపోయిన ప్రమోషన్‌లు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు.

తప్పుడు కేసులకు భయపడేది లేదు



నెల్లూరు సిటీ: రూరల్ ఎమ్మెల్యే కార్యాలయం నుంచి వచ్చిన ఆదేశాల మేరకు తనపై తప్పుడు కేసు బనాయించారని, ఇలాంటి వాటికి భయపడేది లేదని వైఎస్సార్‌సీపీ 17వ డివిజన్ కార్పొరేటర్ పేనేటి సుధాకర్ అన్నారు. ఈ మేరకు ఆయన రూరల్ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాపై సోషల్ మీడియాలో ప్లాట్లు ఆక్రమించినట్లు కొందరు ఆరోపణ చేస్తున్నారన్నారు. ఇది పూర్తిగా అవాస్తవమన్నారు. తాను వాళ్లపై దౌర్జన్యం చేసి దాడి చేశానని తప్పుడు కేసు పెట్టారని, న్యాయపరంగా ఎదుర్కొంటానన్నారు. దళితుడైన తనను ఇబ్బంది పెట్టాలని రూరల్ ఎమ్మెల్యే కార్యాలయం నుంచి వచ్చిన ఆదేశాల ప్రకారం ఇటువంటి తప్పుడు కేసులు పెడుతున్నారన్నారు. తాను నిజంగా తప్పు చేసి ఉంటే శిక్షణ అనుభవించడానికి సిద్ధంగా ఉన్నానని చెప్పారు.

వ్యక్తిగత పరిశుభ్రతతోనే ఆరోగ్యం


నులిపురుగుల నివారణ మాత్రలను మింగిస్తోన్న ఆరోగ్యశాఖ డైరెక్టర్

నెల్లూరు(అర్బన్): పరిశుభ్రమైన ఆహారం, రక్షిత మంచినీరు, వ్యక్తిగత పరిశుభ్రతతోనే పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ హెల్త్ డాక్టర్ పద్మావతి అన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని డాక్టర్ పద్మావతి నగరంలోని పప్పులవీధిలో ఉన్న వైవీఎం మున్సిపల్ పాఠశాలలో మంగళవారం డీఎంహెచ్‌ఓ సుజాతతో కలిసి జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని ప్రారంభించారు. పలువురు విద్యార్థులకు ఆల్‌బెండజోల్ మాత్రలను మింగించారు. ఆమె మాట్లాడుతూ నులిపురుగులు చేరడం వల్ల పిల్లలకు ఆకలి మందగిస్తుందని, రక్తహీనత వస్తుందన్నా రు. కాగా జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవంలో భాగంగా మంగళవారం జిల్లా వ్యాప్తంగా 5,51,722 మంది పిల్లలకు మాత్రలు పంపిణీ చేసి 96.82 శాతం విజయవంతం చేశామని డీఎంహెచ్‌ఓ సుజాత తెలిపారు.

- బుజబుజనెల్లూరు శేషు ఇంగ్లిష్ మీడియం పాఠశాలల విద్యార్థులకు పీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్, 25వ డివిజన్ కార్పొరేటర్ నరసింహగిరి ఆధ్వర్యంలో నులిపురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేశారు.
- కోటమిట్ట ఆరోగ్య కేంద్రంలో డీవార్మింగ్ డే కార్యక్రమాన్ని జిల్లా మలేరియా నివారణాధికారి హుస్సేనమ్మ, డీపీఎంఓ రమేష్ తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రం డాక్టర్ సిద్దీక్, కో–ఆర్డినేటర్ తిరుపతయ్య పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపునకు చర్యలు

నెల్లూరు(బారకాసు): నగరంలో రోడ్లను ఆక్రమిస్తూ చేపడుతున్న నిర్మాణాలను గుర్తించి యజమానులకు హెచ్చరికలను జారీ చేసి తొలగించేలా చర్యలను చేపట్టాలని కమిషనర్ వైఓ నందన్ ఆదేశించారు. స్థానిక శోధన్ నగర్, శివగిరి కాలనీ, జాకీర్ హుస్సేన్ నగర్, రంగనాయకులపేట పినాకిని పార్క్ తదితర ప్రాంతాల్లో కమిషనర్ మంగళవారం పర్యటించారు. రోడ్లను ఆక్రమిస్తూ కాలువలపై శాశ్వత నిర్మాణాలను చేపట్టవద్దని అవగాహన కల్పించాలని సూచించారు.

- నెల్లూరును మోడల్ సిటీగా రూపొందించేందుకు అవసరమైన పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టిని సారించాలని కమిషనర్ నందన్ సూచించారు. రెవెన్యూశాఖ వారాంతపు సమీక్షా సమావేశాన్ని ఎన్ఎంసీలో మంగళవారం నిర్వహించారు. దీర్ఘకాలికంగా ఉన్న ఆస్తి పన్ను బకాయిలపై ప్రత్యేక దృష్టి సారించారు.

పీ4లో భాగస్వాములు కండి

పీ4లో భాగంగా అభివృద్ధి చెందిన కుటుంబాలు ఆపన్నులకు సహాయ సహకారాలు అందించాలని కమిషనర్ నందన్ కోరారు. ఈ మేరకు ఆయన స్థానిక ఆచార్య వీధిలోని పలు బంగారు దుకాణాల నిర్వాహకులతో కమిషనర్ ప్రత్యక్షంగా కలిసి మాట్లాడారు. పీ–4లో భాగస్వామ్యం కావాలని కోరారు.

ఎల్‌ఆర్‌ఎస్ స్కీమ్‌పై సమావేశం

నెల్లూరురూరల్: ఎల్‌ఆర్‌ఎస్ స్కీమ్‌పై కలెక్టరేట్‌లోని ఎస్సార్ శంకరన్ మందిరంలో తహసీల్దార్లు, ఎంపీడీఓలు, సర్వేయర్లతో జేసీ, నుడా వైస్ చైర్మన్ కార్తీక్ మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నుడా చైర్మన్ శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ అనధికార లేఅవుట్లు, ప్లాట్లను క్రమబద్ధీకరించుకోవడానికి ఈ స్కీమ్ గొప్ప అవకాశమని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కందుకూరు సబ్ కలెక్టర్ హిమవంశీ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

తెలంగాణ సీఈఐజీగా జిల్లా వాసి



నెల్లూరు(వీఆర్సీసెంటర్): తెలంగాణ రాష్ట్ర చీఫ్ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్ టు గవర్నమెంట్(సీఈఐజీ)గా జిల్లాలోని ఇందుకూరుపేట మండలం, పున్నూరు పంచాయతీ మూలపాడు గిరిజన కాలనీకి చెందిన కొమరగిరి నందకుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆయనకు మంగళవారం పలువురు అభినందనలు తెలిపారు.

హామీలను విస్మరించిన ప్రభుత్వం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): గత ఎన్నికలకు ముందు మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీల అమలును కూటమి ప్రభుత్వం విస్మరించిందని సీఐటీయూ నగర కార్యదర్శి నాగేశ్వరరావు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పెంచలనరసయ్య ఆరోపించారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) నెల్లూరు నగర మూడో మహాసభలను బాలాజీనగర్‌లోని రామచంద్రారెడ్డి భవన్‌లో మంగళవారం నిర్వహించారు. అమరవీరుల పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం వీరు మాట్లాడారు. వివిధ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం 75 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు.

భక్తిశ్రద్ధలతో కాత్యాయని వ్రతం



నెల్లూరు(బృందావనం): శ్రావణ మాస మంగళవారాన్ని పురస్కరించుకొని నగరంలోని రాజరాజేశ్వరి దేవస్థానంలో కాత్యాయని వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దేవస్థాన ప్రాంగణంలోని అనివెట్టి మండపంలో అమ్మవారు ప్రత్యేక పుష్పాలంకారంలో దర్శనమిచ్చారు. తొలుత మూలవర్లకు విశేష పూజలను జరిపారు. ప్రధానార్చకుడు రఘురామ్మూర్తి, ఈఓ కోవూరు జనార్దన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అలరించిన ఉపన్యాసం

నెల్లూరు(బృందావనం): పురమందిరం ప్రాంగణంలోని వర్ధమాన సమాజం హాల్లో చేతన సంగీత సాహిత్య సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో 'కైలాస శంకరులే కాలడి శంకరులు' అనే అంశంపై ఉపన్యాసకుడు గుడ్లదొన వెంకటసాయి ఆంజనేయవరప్రసాద్‌రావు మంగళవారం రాత్రి చేసిన ఉపన్యాసం అలరించింది. కృష్ణపట్నం ఇమామి ఆగ్రోటెక్ వైస్ ప్రెసిడెంట్ ఎంవీ నారాయణమూర్తి హాజరయ్యారు. తొలుత ఆదిశంకరాచార్యుల చిత్రపటానికి పుష్పాంజలి సమర్పించారు. అనంతరం ఆంజనేయవరప్రసాద్‌రావు దంపతులను సన్మానించారు.కార్యక్రమంలో చేతన సంస్థ కార్యదర్శి వై.శేషగిరీశం, సభ్యులు విశ్వనాథం, సుబ్బరాయుడు, నరసింహం, నలుబోలు బలరామయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

18న చలో కరేడు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జిల్లాలోని కరేడు ప్రాంత రైతాంగ సమస్యలపై ఈనెల 18న చలో కరేడు కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు షానవాజ్, గంగపట్నం రమణయ్య తెలిపారు. సంతపేటలోని సీపీఐ కార్యాలయంలో మంగళవారం వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. కరేడులో అన్నదాతలకు మద్దతుగా వెళ్లిన రైతు సంఘ నాయకులపై అక్రమ కేసులు పెట్టడం సరికాదన్నారు. సమావేశంలో సీపీఐ నాయకులు నందిపోగు రమణయ్య, నందయ్య, శిరీషా, సుబ్బరాయుడు, వెంకటేశ్వర్లు, చెన్నయ్య పాల్గొన్నారు.

- 'చలో కరేడు' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు.

పలువురికి సన్మానం

నెల్లూరు(సిటీ): రూరల్ నియోజకవర్గ పరిధిలోని గుండ్లపాళెం వ్యవసాయ కో–ఆపరేటివ్ సొసైటీ చైర్మన్‌గా ఎన్నికైన చేనేత నాయకుడు పముజుల ప్రదీప్‌ను చేనేత ఐక్య కార్యాచరణ కమిటీ నాయకులు మంగళవారం సన్మానించారు. సౌత్‌మోపూరు గ్రామంలోని ఆయన నివాసంలో శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. చేనేత ఐక్య కార్యాచరణ కమిటీ జిల్లా అధ్యక్షుడు బుధవారపు బాలాజీ, నాయకులు జానపాటి రామసుబ్బయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ గోపాల్ పాల్గొన్నారు.

- **నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట):** నగరంలోని శాంతినగర్‌లో ఉన్న దూదేకుల జిల్లా కార్యాలయంలో సంఘ జిల్లా అధ్యక్షుడు సలీమ్ ఆధ్వర్యంలో పలువురిని సన్మానించారు. మస్తాన్, షరీఫ్, మహమ్మద్‌లను జిల్లా కమిటీ నాయకులు సత్కరించి అభినందనలు తెలిపారు.

పీడీఎస్‌యూ నాయకుల నిరసన



నెల్లూరు(టౌన్): విద్యార్థిని హేమశ్రీ అనుమానాస్పద మృతికి కారణమైన ఆర్ఎన్నార్ కళాశాల యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరుతూ మంగళవారం ఇస్కాన్ సిటీ సమీపంలోని ఆ కళాశాల వద్ద పీడీఎస్‌యూ నాయకులు మంగళవారం ధర్నా జరిపారు. ఈ సందర్భంగా షారూక్‌ఖాన్ మాట్లాడుతూ ఆర్ఎన్ఆర్ జూనియర్ కళాశాల గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆ సంఘ నాయకులు నవీన్, హర్ష, వసీం, మస్తాన్ పాల్గొన్నారు.

బైక్ చోరీ

నెల్లూరు(క్రైమ్): ఇంటి ముందు నిలిపి ఉంచిన బైక్ చోరీకి గురైంది. వివరాలు.. కొయ్య పని చేసుకొని జీవనం సాగించే విక్రమ్‌నగర్‌కు చెందిన సుందరరావు తన హీరో హెచ్‌ఎఫ్ డీలక్స్ బైక్‌ను ఇంటి ముందు ఈ ఏడాది మే 12న నిలిపి నిద్రించారు. మరుసటి రోజు ఉదయానికి బైక్ అదృశ్యమైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేశారు.

ఘనంగా వార్షికోత్సవం



నెల్లూరు(బృందావనం): చక్రాలవారి ట్రస్ట్ ఆధ్వర్యంలో పొగతోటలోని ఆదిశంకర ధ్యాన మందిర వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం సత్సంగం నిర్వహించారు. ఈ సందర్భంగా హృదానందజీ మహరాజ్ ఉపన్యసించారు. ఈ సందర్భంగా చిన్నారులచే నిర్వహించిన సంగీత రవళి అలరించింది. తొలుత చక్రాల ఆనంద్‌కుమార్, వెంకటలక్ష్మీనరసింహం ఆధ్వర్యంలో శంకర భగవత్పాదుల వారి పాదుకలకు అభిషేకం చేశారు.

పెద్దాస్పత్రిలో ఎంహెచ్‌ఓ తనిఖీ

నెల్లూరు(అర్బన్): నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో కుక్కలు, పందులు ఎక్కువగా సంచరిస్తున్నాయని, దీంతో రోగులు ఇబ్బంది పడుతున్నారని ఆస్పత్రి అధికారులు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో మంగళవారం మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కనకాద్రి తనిఖీలు నిర్వహించారు. పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ కొండేటి మాధవి మాట్లాడుతూ ప్రతిరోజూ చెత్తను మున్సిపల్ సిబ్బంది తరలించేలా చర్యలు తీసుకోవాలని, కుక్కలను పట్టి తరలించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. దీంతో ఎంహెచ్‌ఓ డాక్టర్ కనకాద్రి సానుకూలంగా స్పందించారు. ఆస్పత్రి అడ్మినిస్ట్రేషన్ అధికారి డాక్టర్ కళారాణి, హాస్పిటల్ డెవలప్‌మెంట్ సొసైటీ కో–ఆర్డినేటర్ మడపర్తి శ్రీనివాసులు, శానిటరీ సూపర్‌వైజర్లు విజయ్, పృథ్వీ పాల్గొన్నారు.

'పవర్' చిత్ర పోస్టర్ ఆవిష్కరణ



నెల్లూరు(బృందావనం): పురమందిరంలో మంగళవారం రాత్రి పీఎంకేఎం ఫైన్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో దివంగత సినీనటి శ్రీదేవి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వీఆర్‌పీ క్రియేషన్స్ పతాకంలో సాయికృష్ణ హీరోగా, దర్శకుడు వెంకటరమణ పసుపులేటి రూపొందిస్తున్న 'పవర్' చిత్ర ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను హిప్నాటిస్ట్ రాంజీ చేతుల మీదుగా ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన శ్రీదేవి సినీ స్వరాంజలి అలరించింది. కార్యక్రమంలో చెన్నై హాస్పిటల్ ఇన్ఫర్మేషన్ సెంటర్ నిర్వాహకుడు ఎస్వీ రమేష్‌బాబు, చిత్ర యూనిట్ శంకర్ మహదేవన్, బీఎస్ కుమార్, నందమూరిహరి, కడలి రాంబాబు, డి.అశోక్ పాల్గొన్నారు.

సుఖవ్యాధులపై అవగాహన తప్పనిసరి

నెల్లూరు(అర్బన్): హెచ్ఐవీ, సుఖవ్యాధులపై ప్రజలు అవగాహన పెంచుకుని తప్పనిసరిగా వాటికి దూరంగా ఉండాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుజాత పేర్కొన్నారు. ఏపీ ఎయిడ్స్ సొసైటీ కంట్రోల్ ఆదేశాలతో ప్రజల్లో అవగాహన పెంచేందుకు జిల్లా వైద్యశాఖ ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీ జరిగింది. డీఎంహెచ్‌ఓ కార్యాలయం నుంచి ప్రభుత్వ బీఈడీ కళాశాల, ములుముడి బస్టాండ్ సెంటర్ల మీదుగా తిరిగి డీఎంహెచ్‌ఓ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ హెచ్ఐవీ, సుఖవ్యాధులతో పాటు డ్రగ్స్‌కు దూరంగా ఉండేలా ప్రజలు చైతన్యం కావాల్సి ఉందన్నారు. జిల్లా లెప్రసి, ఎయిడ్స్, టీబీ నివారణాధికారి డాక్టర్ ఖాదర్‌వలీ మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థలు భాగస్వాములై ఇంటింటికెళ్లి కరపత్రాలు పంచుతూ అవగాహన కల్పించాలన్నారు. జిల్లా మలేరియా నివారణాధికారి హుస్సేనమ్మ, పలువురు డాక్టర్లు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

సాంకేతిక విద్యపై సలహాలు అందించాలి

నెల్లూరు(అర్బన్): వికసిత్ భారత్ 2047లో భాగంగా నాణ్యమైన, సాంకేతిక విద్య అందించేందుకు అవసరమైన సలహాలు అందించాలని విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులకు డీఈఓ బాలాజీరావు, సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ వెంకటసుబ్బయ్య సూచించారు. వికసిత్ భారత్ లక్ష్యాల సాధనలో భాగంగా కలెక్టేట్‌లోని తిక్కన ప్రాంగణంలో స్కూల్ బిల్డింగ్ బ్లాక్స్ అనే అంశంపై మంగళవారం వర్క్‌షాపు జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యావ్యవస్థలో ఉన్న అడ్డంకులు, ఇబ్బందులు అధిగమించడానికి ఐదుగురు విద్యావేత్తలను సలహాల కోసం ఎంపిక చేశామని తెలిపారు. వీరు ఇక్కడ పేర్కొన్న సలహాలను జాతీయ స్థాయి ప్రభుత్వ కార్యదర్శుల సమావేశంలో సమర్పిస్తారని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈఓలు, అన్ని మండలాల విద్యాశాఖాధికారులు, సెక్టోరియల్ అధికారులు, ప్రిన్సిపల్స్, ప్రధానోపాధ్యాయులు, సబ్జెక్టు నిపుణులు పాల్గొన్నారు.

రైతు శ్రేయస్సు కోసమే సంఘాలు

నెల్లూరు (వీఆర్సీ సెంటర్): రైతు శ్రేయస్సు, అధిక దిగుబడి, వ్యవసాయ సాంకేతికత, పంటల పరిరక్షణ, మార్కెటింగ్, పంట సేకరణ, గిట్టుబాటు ధరలు అందించేందుకే రైతు ఉత్పత్తిదారుల సంఘాలను స్థాపించినట్లు డీసీఓ గుర్రప్ప అన్నారు. నగరంలోని డీసీఓ కార్యాలయంలో మంగళవారం జలదంకి మండల వ్యవసాయ అనుబంధ ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకార సంఘ సభ్యులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. అదేవిధంగా సహకార చట్టం ప్రకారం సంఘాల నిర్వహణ అంశంపై జిల్లాలోని పీఏసీఎస్ సీఈఓలకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. పీఏసీఎస్‌లలో వ్యవహారాలను ఆన్‌లైన్ పద్ధతిలో చేపట్టాలన్నారు.